

కూల్..కూల్

తిరుమల : ఎండలతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆలయం ఎదుట భక్తుల కాళ్లు కాలకుండా నీళ్లు చల్లడం కనిపించింది.



జగన్‌మామ నీకు వందనం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం, ఎస్‌ఎస్‌పురం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. 'జగన్ మామ' పాటకు విద్యార్థుల నృత్యం ఆకట్టుకుంది.



పోషకాహార పక్వాడ

పులిచెర్ల(కల్లూరు): పోషకాహార పక్వాడలో భాగంగా పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాహార ముగ్గు ఆకట్టుకుంది.



న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 1,245 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 141పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. జనరల్‌లో 41,005 మంది, ఒకేషనల్‌లో 2,977 మొత్తం 43,982 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉంది. వీరిలో 1,245 మంది గైర్హాజరైనట్టు ఆర్‌ఐఓ వీ.రమేష్ తెలిపారు. అలాగే మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడిన 8 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షలో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్ష జరుగుతుందని ఆర్‌ఐఓ తెలిపారు.

స్పందనకు 75 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ వెంకటరావు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 75 ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్ తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తివివాదాలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయని చెప్పారు. వీటిని వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రేపు శిల్పారామంలో ప్రాంతీయ డ్వాక్రా బజార్

తిరుపతి అర్బన్: శిల్పారామంలో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 09 వరకు ప్రాంతీయ డ్వాక్రా బజార్, సరస్ ఫెయిర్- 2023ను భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. 700 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతు ఉత్పాదక గ్రూప్‌లు వివిధ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని వెల్లడించారు.

ప్రతి గర్భిణీకి హెచ్‌ఐవీ పరీక్ష తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: ప్రతి గర్భిణీకి హెచ్‌ఐవీ పరీక్షలు తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి స్పష్టం చేశారు. తిరుపతిలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి ఈఎంటీసీటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలతో పాటు వారి భర్తలకు కూడా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించాలన్నారు. హెచ్‌ఐవీతో పాటు సిఫిలిస్, హెపిటైటిస్ బీ, సీ పరీక్షలు కూడా నిర్వహించాలని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అరుణ సులోచనాదేవి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గర్భిణీ స్త్రీ మొదటి త్రైమాసికంలో ఇతర రక్త పరీక్షలతో పాటు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. డాక్టర్ శేషాద్రి మాట్లాడుతూ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లలో హెచ్‌ఐవీ పరీక్షలలో పాజిటివ్ అని గుర్తించిన వారిని ప్రభుత్వ ఆస్పత్రులలోని ఐసీటీసీ కేంద్రాలకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్య అధికారులు పార్థసారథి, భారతి, ఆనందరావు, అనిల్, భార్గవ్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం వెంకటరత్నం, సాధీస్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శేషాద్రి పాల్గొన్నారు.

సేద్యంలో రాణి

- సేంద్రియ వ్యవసాయంలో సత్తా చాటుతున్న పట్టభద్ర మహిళలు
- ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా స్వయం కృషితో ముందుకు
- పొలం లీజుకు తీసుకుని కొందరు, సొంత పొలంలో మరికొందరు సేద్యం
- ఆరోగ్యాన్ని అందిస్తూ, లాభాలు ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న వైనం

ఒకప్పుడు ఒంటింటి కుందేళ్లుగా పేరుగడించిన మహిళలు ఇప్పుడు ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు. అవనిలో సగం.. ఆకాశంలో సగం.. అంటూ అత్యుత్తమంగా రాణిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమకు ఇష్టమైన రంగాలను ఎంచుకుని విశేషంగా రాణించేస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు ప్రకృతిసేద్యం వైపు మొగ్గుచూపుతు న్నారు. ఎలాంటి రసాయన అవశేషాలు లేని అమృత ఆహారాన్ని పండిస్తూ.. అందరికీ ఆరోగ్యాన్ని పంచుతున్నారు. ఓ వైపు కుటుంబానికి అండగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మరో వైపు ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ అబలలు కాదు.. సబలలమని నిరూపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టభద్ర మహిళల వ్యవసాయ పద్ధతులు, పంటల రకాలు, కుటుంబ నేపథ్యం తదితరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి, తిరుపతి











సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకు కూరలు, కూరగాయలు

ఆనందంగా ఉంటూ..ఆరోగ్యాన్ని పంచుతూ..!



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వంగ తోటలో మహిళా రైతు శ్రీదేవి



శ్రీదేవి

వడమాలపేట మండలం, ఎస్‌బీఆర్‌పురానికి చెందిన శ్రీదేవి డిగ్రీ పూర్తిచేశారు. ఉద్యోగం కోసం ఎదురు చూడలేదు. ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు విఫలమైనా కుంగిపోలేదు. తమకున్న ఏడెకరాల పొలంలో సేంద్రియ పద్ధతులతో మామిడి సాగుచేస్తున్నారు. మరో ఎకరం పొలం లీజుకు తీసుకుని అందులో టమాట, ఉల్లి, బెండ, వంగ, ముల్లంగి, పచ్చిమిర్చి, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయల సాగుచేస్తున్నారు. స్కూలు, అంగన్‌వాడీ పిల్లల మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే కూరగాయలను అందిస్తున్నారు. పిల్లల ఆరోగ్యానికి తమవంతు సహకారం అందిస్తున్నారు. వీరికి పోను మిగిలిన కూరగాయలను తిరుపతికి తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. భర్త ఇద్దరు పిల్లలతో హ్యాపీగా జీవనం సాగిస్తున్నారు.

వసుదైక కుటుంబానికి పసందైన వంటకాలు





వరలక్ష్మి

పలమనేరు మండలం, మొరం గ్రామానికి చెందిన వరలక్ష్మి బీటెక్ పూర్తి చేశారు. భర్త ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండగా ఆమె ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు. వీరిది ఉమ్మడి కుటుంబం. పిల్లలు, పెద్దలు అంతా కలిపి 30 మంది వరకు ఉంటారు. సేద్యంపై ఉన్న మక్కువతో ప్రకృతి వ్యవసాయం చేయాలని నిర్ణయించారు. మొరం గ్రామంలో రెండెకరాల పొలంలో పది రకాల పంటలు సాగుచేయడం ప్రారంభించారు. ఆకు కూరలు, కూరగాయలతో పాటు మహాగణి మొక్కలు నాటారు. కూరగాయలు తమ కుటుంబానికే వినియోగించుకుంటుండగా.. మిగిలిన వాటిని గ్రామంలోనే విక్రయిస్తుంటారు.

నేచురల్‌గా ముందుకు సాగాలని..



కల్పన

చిత్తూరు జిల్లా, రొంపిచర్ల మండలం, బెస్తపల్లెకు చెందిన కల్పన ఎంకాం, బీఈడీ, డీఈడీ పూర్తిచేశారు. ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు విఫలమవ్వడంతో వ్యవసాయం వైపు మొగ్గుచూపారు. నేచురల్ ఫామింగ్‌లో చేరారు. అక్కడ ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తీసుకుంటున్నారు. తాను నేర్చుకున్న విద్యను ఆచరణలో చూపాలనుకుని.. ఏడాది క్రితం గ్రామంలోనే అర ఎకరా లీజుకు తీసుకుని సాగుచేయడం ప్రారంభించారు. అందులో నవధాన్యాలు, జొన్న, మొక్కజొన్న, మిరప, వంగ, ఉల్లి, మునగ, టమాట, కొత్తిమీర, వివిధ రకరకాల ఆకు కూరలు సాగుచేస్తున్నారు. చిన్నాన్న కేశవులు సాయంతో పండించిన కూరగాయాలను మార్కెట్లో విక్రయిస్తున్నారు.



సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన పంట పొలంలో కల్పన

ప్రకృతి సాగు..భలే బాగు



రేఖ

ఐరాల మండలం, మిట్టూరుకు చెందిన రేఖ ఎంఏ, ఎంఈడీ పూర్తిచేశారు. ఉద్యోగం కోసం ఎదురుచూడ లేదు. ఉన్న వ్యవసాయ భూమిలో ప్రకృతి సాగుచేయాలని భావించారు. మొత్తం పది ఎకరాల పొలం ఉంటే.. అందులో మూడు ఎకరాలను ప్రకృతి సాగు కోసం కేటాయించారు. మిగిలిన భూమిలో మామిడి సాగు చేస్తున్నారు. మూడెకరాల్లో వరి, వేరుశనగ, చిరుధాన్యాలు, వివిధ రకాల కూరగాయలు సాగుచేస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్న పంట ఉత్పత్తులను కొనుగోలు చేసుకునేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆడపడుచుల అభ్యున్నతికి 'ఆసరా'



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- చంద్రబాబు మోసపు మాటలను ప్రజలు నమ్మరు
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి రోజా

శ్రీరంగరాజపురం/పుత్తూరు రూరల్ : ఆడపడుచుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. సోమవారం ఎస్‌ఆర్‌పురంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడోవిడత నగదు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాల ద్వారా కనీసం రూ.3లక్షల నుంచి రూ.15లక్షల వరకు లబ్ధిపొందారని వెల్లడించారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఎప్పుడైనా ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టారా అని ప్రశ్నించారు. 2024లో అధికారం చేపట్టాలని తాపత్రయ పడుతున్న చంద్రబాబు ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తామని చెప్పగలరా అని సవాల్ విసిరారు. 2016లో ఆగిపోయిన సున్నావడ్డీ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అనంతరెడ్డి, సర్పంచ్ హరిత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, ఏపీఎం రోజా పాల్గొన్నారు.

జగనన్నకే మళ్లీ పట్టాభిషేకం

సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు మళ్లీ పట్టాభిషేకం చేస్తారని మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. సోమవారం పుత్తూరులో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడోవిడత చెక్కుల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. సుమారు 11,897 మంది లబ్ధిదారులకు గాను రూ.11.27 కోట్ల చెక్కును అందజేశారు. మంత్రి రోజా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ ఆడపడుచుల పేరిటే అమలు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. అదేవిధంగా 2019 ఎన్నికల్లో కూడా మోసం చేసేందుకు యత్నిస్తారని, అయితే బాబు కల్లిబొల్లి మాటలను ఎవరూ నమ్మరని స్పష్టం చేశారు. అవినీతి రాజకీయాలకు అలవాటు పడిన చంద్రబాబు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు ఎమ్మెల్యేను కొనుగోలు చేశారని ఆరోపించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును తగిన బుద్ధి చెప్పి హైదరాబాద్‌కు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ప్రతి మహిళా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా జిల్లా అధికారి శ్రీరాములు, మెప్మా సిటీ మేనేజర్ ప్రమీలా, మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, ఎంపీడీఓ ఇందిర, మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ అదాలత్

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్ అదాలత్ కార్యక్రమం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, విజయవాడ వారు కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యానికి అత్యంత ప్రాధాన్యం



కలెక్టరేట్‌లో 104 కొత్త వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన, కలెక్టర్ తదితరులు

- కొత్తగా ఏడు 104 వాహనాల ప్రారంభం

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏడు కొత్త 104 వాహనాలను కలెక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. గత అక్టోబర్ 21వ తేదీన ముఖ్యమంత్రి చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జిల్లాలో 104 వాహనాలు 32 ఉండగా, మరో 7 కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనే వైద్యం అందుబాటులో ఉండేలా ప్రతి 2 వేల మందికి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. గడప వద్దకే వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా జిల్లాలోని 436 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సచివాలయ పరిధిలో ఉండేలా చర్యలు చేపట్టారన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రభుత్వ సెలవులు మినహా నెలలో 26 రోజులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీలను సందర్శించి పిల్లలకు వైద్యం అందిస్తాని తెలిపారు. వయోభారంతో ఇంటి వద్దే వైద్యం పొందుతున్న వారికి సేవలు అందిస్తారని వెల్లడించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, 104 జిల్లా కో–ఆర్డినేటర్ శేషశయనారెడ్డి, డాక్టర్ ఛత్రప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జయజయరామ.. జానకిరామ

- వైభవంగా కోదండరాముని రథోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఉదయం స్వామి వారి రథోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి రథాన్ని అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. డప్పు వాయిద్యాలు, భజన బృందాల కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అడుగడుగునా భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రథం నాలుగు మాడ వీధుల్లో ఊరేగి యథాస్థానానికి చేరిన తర్వాత ప్రబంధం, వేద శాత్తుమొర నిర్వహించి హారతి సమర్పించారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహించారు. రాత్రి స్వామివారి అశ్వవాహన సేవ వేడుకగా సాగింది. పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్నం, ఈఈలు వేణుగోపాల్, శివరామకృష్ణ, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి, డీఈ చంద్రశేఖర్, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, కంకణభట్టర్ ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి పాల్గొన్నారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న కోదండరామస్వామి



కోలాహలంగా సాగుతున్న రథోత్సవం

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చక్రస్నానఘట్టాన్ని వేడుగా నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు కపిలతీర్థం పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరగనుంది.

క్లుప్తంగా

ట్యాంకర్ బోల్తా




చంద్రగిరి: ప్రమాదవశాత్తు కెమికల్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటన సోమవారం భాకరాపేట కనుమలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. హిందూపురం నుంచి రేణిగుంటకు కెమికల్‌తో ట్యాంకర్ బయల్దేరగా.. భాకరాపేట కనుమలోని దెయ్యాలకోన వద్ద అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కర్నూలు జిల్లా, వెలుగోడుకు చెందిన డ్రైవరు జనార్దన్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. చంద్రగిరి ఎస్‌ఐ వంశీధర్, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గర్భాలయ ద్వారం రాతి శిలకు ప్రత్యేక పూజలు



హుండీ లెక్కింపులో సిబ్బంది



శిరోభాగంలో ఏర్పాటు చేసే రాతి శిల(ఇన్‌సెట్) పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా అమ్మవారి గర్భాలయ సింహ ద్వారపు శిరోభాగంలో ఏర్పాటు చేసే గజలక్ష్మి అమ్మవారి ప్రతిమ కలిగిన రాతి శిలకు సోమవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణంలో ప్రతి రాయి అమ్మవారి రూపంతో సమానంగా పూజించి ప్రతిష్ఠించడం జరుగుతోంది. ఇందులో భాగంగా రాతి శిలకు పూజలు చేసిన అనంతరం అమ్మవారి గర్భాలయ సిమహద్వారంపై రాతి శిలను ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.23.35 లక్షలు

అమ్మవారి హుండీ లెక్కింపు ద్వారా రూ.23,35,036 ఆదాయం లభించింది. అలాగే 20 గ్రాముల 250 మిల్లీగ్రాముల బంగారం, 269 గ్రాముల 200 మిల్లీగ్రాముల వెండిని భక్తులు కానుకగా సమర్పించారు.

బయోటెక్నాలజీ విభాగానికి నిధులు మంజూరు



నిధుల మంజూరు పత్రాన్ని చూపుతున్న వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ, బయోటెక్నాలజీ విభాగానికి కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నిధులు మంజూరు చేసినట్లు ఆ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి తెలిపారు. ఆ వర్సిటీలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన దీనికి సంబంధించిన పత్రాన్ని ఆవిష్కరించారు. దేశంలో బయోటెక్నాలజీ రంగంలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ నిధులను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,100
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,457
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,700
రిటైల్ వెండి గ్రాము	రూ.73.70

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	25
తిరుమల	32	21
చిత్తూరు	36	24
గూడూరు	37	26
నగరి	37	26

గడువులోగా రీ సర్వే పూర్తిచేయండి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు

వెంకటగిరి: నిర్దేశించుకున్న గడువులోగా జగనన్న భూహక్కు – భూరక్ష పథకం ద్వారా కచ్చితత్వ హద్దులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని డీసీ కండ్రిగ గ్రామంలో జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, జిల్లా సర్వేయర్ జయరాజ్‌తో కలిసి ఆయన రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రీసర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. రీ సర్వే నిర్వహించే గ్రామాల్లో సర్వేకు ముందుగా నోటీసులు అందజేయడం, దండోరా వేయించడం వంటి నిబంధనలు పాటించాలని అధికారులకు సూచించారు. కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నప్పుడు భూయజమానులకు నోటీసులు అందించి గ్రౌండ్ వ్యాలిడేషన్ చేపట్టాలన్నారు. అనంతరం మొక్కలపాడు గ్రామంలో రీ సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ పద్మావతి, రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ చంగల్‌రాణి పాల్గొన్నారు.

రెండవ ఘాట్ రోడ్డులో ప్రమాదం



క్షతగాత్రుడికి చేయూత అందిస్తున్న వన్‌టౌన్ సీఐ

తిరుమల : రెండవ ఘాట్ రోడ్డులో ఓ కారు ప్రమాదానికి గురైంది. తమిళనాడుకు చెందిన భక్తులు కారులో శ్రీవారి దర్శనార్థం అలిపిరి నుంచి తిరుమలకు బయలుదేరారు. ఈ క్రమంలో రెండవ ఘాట్ రోడ్డు మధ్యలో కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయమైంది. ఇంతలో అటుగా వెళ్తున్న వన్‌టౌన్ సీఐ జగన్‌మోహన్‌రెడ్డి 108కు సమాచారం అందించి గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించారు.

పెంచలకోన దేవస్థానానికి భారీ రాబడి



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

రాపూరు: పెంచలకోన దేవస్థానానికి ఒక కోటి, రెండులక్షల, ముప్పై రెండువేల మూడు వందల, ఎనభై రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ జనార్దన్ రెడ్డి, జిల్లా ఎండోమెంట్ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థాన అలంకారమండపంలో హుండీ కానుకలను లెక్కించగా.. నగదుతోపాటు 360 గ్రాముల బంగారం, వెండి 4 కిలోల 800 గ్రాములు, యూఎస్‌ఏ డాలర్లు 89, కువైట్ దినార్లు 52, బహరీన్ దినార్ 1, మలేషియారింగిట్స్ 11, ఇంగ్లండ్ ఫైన్లు 25 వచ్చినట్లు వివరించారు. శ్రీవారి నిత్యాన్నదానంలోని హుండీలో రూ.3,85,908 వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తం 86 రోజులకు చెందినదని వారు వెల్లడించారు.

నిబంధనల మేరకే పంచనామా



మాట్లాడుతున్న ఈఓ సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో మూలవిరాట్ తొలగింపు సందర్భంగా నిబంధనల ప్రకారమే పంచనామా నిర్వహించామని ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఆలయ పరిపాలనా భవనంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆలయ మూలవిరాట్ తొలగింపులో విపక్షాలను పిలవలేదన్న అక్కసుతో అక్కడ లభించిన బంగారాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హైదరాబాద్‌లో అమ్ముకున్నారంటూ టీడీపీ నేత బొజ్జలసుధీర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఆయన స్పందించారు. స్వామివారి మూలవిరాట్ తొలగింపు విషయాన్ని నాలుగు రోజుల ముందు ప్రకటించామని చెప్పారు. అందరి సమక్షంలో మూలవిరాట్‌ను నిబంధనలకు అనుగుణంగా తొలగించామన్నారు. సీసీకెమెరాల నిఘాలోనే పంచనామా నిర్వహించామన్నారు. బంగారు, వజ్రాలు దొరికాయంటూ టీడీపీ నేత చేసిన ఆరోపణలు అసత్యమన్నారు. ఇలాంటి ఆరోపణలపై దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అర్చకుడు మాట్లాడుతూ ఆలయ మూలవిరాట్ తొలగింపునకు పీఠాధిపతులు వంటి వారు రారని, అందరి సమక్షంలోనే పంచనామా నిర్వహించి మూలవిరాట్‌ను పానవట్టం నుంచి తొలగించామని తెలిపారు. అందులోని బంగారు, నవరత్నాలు, రాగిరేకులను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచినట్లు వెల్లడించారు. అనంతరం వీఆర్వో బాలమురళి తాను చూసిన దాన్ని చూసినట్లు వివరించగా.. పాలకమండలి సభ్యులు జయశ్యామ్‌రాయల్ ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తే శ్రీకాళహస్తిలో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో మల్లికార్జున్, మురళీధర్‌రెడ్డి, లోకేష్, సతీష్‌మాలిక్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా 'పది' పరీక్షలు



చిత్తూరు కలెక్టరేట్/ తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షలను ఎలాంటి తప్పులకు తావులేకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. సోమవారం ఈ మేరకు పరీక్షల నిర్వహణపై డీఈఓకు పలు సూచనలు చేశారు. దీనిపై డీఈఓ శేఖర్ మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్లు, నామినల్ రోల్స్‌లో ఏమైనా తప్పు ఉంటే సవరణకు అవకాశం కల్పించామన్నారు. ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నష్టం వాటిల్లితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

- ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే పరీక్షలకు సంబంధించి రోజువారీ సబ్జెక్టులను తెలుసుకునేందుకు టైమ్‌టేబుల్‌ను తప్పనిసరిగా చూసుకోవాలి.
- విద్యార్థులు ఉదయం 8:45 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
- హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా తీసుకెళ్లాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉంచుకోకూడదు.
- పరీక్ష కేంద్రం నుంచి 12:45 గంటల లోపు ప్రశ్నపత్రాన్ని బయటకు తీసుకెళ్లకూడదు.
- ఓఎంఆర్ షీట్‌లో వివరాలను సరిచూసుకున్న తర్వాతే జవాబులు రాయాలి.
- పెన్ను, పెన్సిళ్లను వెంట తెచ్చుకోవాలి. ఆహారపదార్థాలు అనుమతించబడవు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతులు రైల్వే కోడూరువాసులు
- వరుసకు అన్నదమ్ములు




షేక్ ఇబ్రహీం, షేక్ మహమ్మద్ ముషబర్ బాషా(ఫైల్)

రేణిగుంట: రేణిగుంట–రైల్వే కోడూరు మార్గంలో కుక్కలదొడ్డి సమీపాన ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. రేణిగుంట ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన షేక్ ఇబ్రహీం (21), షేక్ మహమ్మద్ ముషబర్ బాషా(30) వరుసకు అన్నదమ్ములు. ఎంజీ రోడ్డులో ఇబ్రహీం చెప్పుల దుకాణం, మహమ్మద్ ముషబర్ బాషా దుస్తుల దుకాణం నడుపుతున్నారు. మహమ్మద్ ముషబర్ బాషాకు వివాహమై ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమారుడు ఉన్నాడు. ఇబ్రహీంకు ఇంకా వివాహం కాలేదు. సోదరులైన వీరిద్దరూ ఆదివారం చెన్నైలోని తమ బంధువుల వద్ద ఓ మోటార్‌బైక్, సెల్‌ఫోను కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై ఆదివారం ఉదయం చెన్నైకి బయల్దేరారు. చెన్నైకి చేరుకుని అక్కడ బేరం కుదరకపోవడంతో కేవలం సెల్‌ఫోను మాత్రమే తీసుకున్నారు. ఆదివారం రాత్రి స్వస్థలానికి తిరుగు పయనమయ్యారు. అర్ధరాత్రి 12గంటల సమయంలో రేణిగుంట మండలం కుక్కలదొడ్డి సమీపంలోని దర్గా వంతెన వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మహమ్మద్ ముషబర్ బాషా తల, మొండెం వేర్వై తునాతునకలుగా ఛిద్రమై పడిపోయాయి. సమాచారం అందుకున్న రేణిగుంట పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించడంతో వారు మార్చురీకి చేరుకుని భోరున విలపించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గ్రీన్‌కోర్ టీచర్స్‌కు అభినందనలు



కలెక్టర్, జేసీ, డీఈఓ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తిరుపతి అర్బన్: గ్రీన్ కోర్ టీచర్స్‌ను కలెక్టర్ వెంకటరమణారెడ్డి అభినందనలతో ముంచెత్తారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉత్తమ హరిత పాఠశాలలకు చెందిన పిల్లలతోపాటు ఉపాధ్యాయులు, డీఈఓ శేఖర్‌తో కలెక్టర్ సమావేశమయ్యారు. ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో తిరుపతి జిల్లా నుంచి ఆరు పాఠశాలలు ఎంపికకావడం హర్షణీయమన్నారు. వారంతా ఢిల్లీకి వెళ్లి అవార్డులు స్వీకరించిన నేపథ్యంలో కలెక్టరేట్, జాయింట్ కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా మరోసారి ధ్రువపత్రాలను అందజేశారు. విద్యార్థి దశ నుంచే పాఠశాలల్లో పర్యావరణ అంశాలను బోధించాలని సూచించారు. ఎన్జీసీ స్టేట్ కో–ఆర్డినేటర్ నీలకంఠయ్య, జిల్లా కో–ఆర్డినేటర్ కే.హరిశంకర్, కేవీ శ్యామ్‌లత పాల్గొన్నారు.

జిల్లాలో ఎంపికైన హరిత పాఠశాలలు

- కమ్మకండ్రిగ : జెడ్పీహెచ్‌ఎస్
- అంజూరు : జెడ్పీహెచ్‌ఎస్
- కల్లివెట్టు : జెడ్పీహెచ్‌ఎస్
- ఎర్రావారిపాళెం : కేజీబీవీ
- నారాయణవనం: (బాలికలు– జెడ్పీహెచ్‌ఎస్
- చంద్రగిరి : (బాలికలు)–జెడ్పీహెచ్‌ఎస్

గంజాయి కేసులో ఏడుగురికి రిమాండ్

తిరుపతి లీగల్ : గంజాయి కలిగిన కేసులో ఏడుగురికి ఏప్రిల్ 10వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్‌సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. తిరుమల ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐకి ఈనెల 26వ తేదీన ఓ వ్యక్తి ఫోన్ చేసి ఓ వ్యక్తి తిరుమలకు గంజాయి తీసుకెళుతున్నాడంటూ సమాచారం ఇచ్చాడు. సీఐ ఉన్నతాధికారుల అనుమతితో తిరుపతి అలిపిరి సమీపంలోని సప్తగిరి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. పదవ లైన్‌లో ఓ వ్యక్తి ప్రయాణికులతో కలిసి తప్పించుకోవడానికి ప్రయత్నించగా సీఐ అతన్ని అదుపులోకి తీసుకున్నాడు. విచారణలో తిరుపతి మంగళం క్వార్టర్స్‌కు చెందిన జి.గంగాద్రిగా తేలింది. అనంతరం అతని వద్ద 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో రేణిగుంట మండలం, కరకంబాడి తారకరామానగర్‌కు చెందిన వి.సక్కూబాయ్ అనే మహిళ వద్ద గంజాయి కొన్నట్టు తెలిపాడు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఆమె ఇంటి తనిఖీలు నిర్వహించి రూ.1.5 లక్షల విలువ చేసే ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మంగళం బీటీఆర్ కాలనీ చెందిన ఎం.సూర్యప్రకాష్, కర్ణాటక చిక్‌బళ్లాపూర్ జిల్లా, మిద్దిళ్లకు చెందిన తిమ్మప్పమహేష్, తిరుమల డీ–టైప్ క్వార్టర్స్‌కు చెందిన బి.రంజన్‌కుమార్ అలియాస్ సునీల్, జార్ఖండ్‌కు చెందిన అమిద్‌కుమార్‌యాదవ్, అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం, టీ సదుంకు చెందిన తళారి శివకుమార్ వద్ద 50 గ్రాముల చొప్పున గంజాయి ఉండడాన్ని గుర్తించారు. ఈ మేరకు ఏడుగురిపై కేసులు నమోదు చేసి సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

అత్యాచారం కేసులో ఇద్దరికి రిమాండ్

ప్రేమపేరుతో ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడమే కాకుండా ఆమెను కులం పేరుతో దూషించిన కేసులో కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, పార్ల గ్రామానికి చెందిన జి.రాజకుమార్‌కు ఏప్రిల్ 10వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం ఆదేశాలు జారీచేశారు. నిందితుడు రాజకుమార్ తిరుపతి శివజ్యోతినగర్‌కు చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానంటూ మాయమాటలు చెప్పి ఆమెను శారీకంగా అనుభవించాడు. ఆమె పెళ్లి చేసుకోమనడంతో కులం పేరుతో దూషించాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు తిరుపతి దిశా పోలీసులు రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

'స్పందన'కు ప్రాధాన్యత ఇవ్వండి



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ, డీఆర్వోలు

తిరుపతి అర్బన్ : స్పందనలో వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితోపాటు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు, స్పెషల్ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రతిఅర్జీని పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మరోవైపు అర్జీలను ఆన్‌లైన్ చేయించడానికి ఇబ్బందులు లేకుండా తహసీల్దార్ కుప్పయ్యను ఏర్పాటు చేశారు.

స్పందనలో 50 శాతమే జిల్లా అధికారులు

స్పందన కార్యక్రమంలో 50 శాతం విభాగాలకు సంబంధించిన వారు మాత్రమే అధికారులు విచ్చేశారు. మరో 25 శాతం విభాగాలకు ద్వితీయశ్రేణి అధికారులు, 25శాతం విభాగాలకు తృతీయ శ్రేణి అధికారులు హాజరయ్యారు.

స్పందనకు 147 అర్జీలు

స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 147 అర్జీలు వచ్చాయి. వాటిలో 112 అర్జీలు ఒక్క రెవెన్యూశాఖకు చెందినవే ఉండడం గమనార్హం.